క్లుప్తంగా

గోరింటాకు సంబరం



గోరింటాకుతో మహిళలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణ కాలనికి చెందిన దుబ్బాసి సరోజన ఆధ్వర్యంలో సోమవారం మహిళలు ఒకే రంగుతో ఉన్న చీరెలను ధరించి గోరింటాకు పెట్టుకుని సందడి చేశారు. కార్యక్రమంలో సంధ్య, సుజాత, లత, లావన్య, వజ్రమ్మ, మాధవి, భాగ్యలక్ష్మీ, చంద్రకళ, రజిత, రేణుకతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ఐటీకి ఎంపిక



సాయి కార్తీక్

జ్యోతినగర్: బాసర ట్రిపుల్ ఐటీకి ఎన్టీపీసీ రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్‌కు చెందిన సాయి కార్తీక్ ఎంపికయ్యారు. టెంపరరీ టౌన్‌షిప్‌లో జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదివిన సాయికార్తీక్ 558 మార్కులు సాధించి స్కూల్ టాపర్గా నిలిచారు. సాయికార్తీక్‌ను పలువురు అభినందించారు.

రాస్తారోకో



గోపరపల్లెలో గ్రామస్తుల రాస్తారోకో

ఓదెల: మండలంలోని గోపరపల్లెలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్ రద్దుచేసి తిరిగి నియమించాలని కోరుతూ గ్రామస్తులు రాస్తారోకో చేశారు. సోమవారం మాజీ సర్పంచ్ కర్క మల్లారెడ్డి, ఉపసర్పంచ్ పోలపల్లి బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఇటీవల పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను సుల్తానాబాద్‌కు డిప్యూటేషన్‌పై పంపిన వారిని వెంటనే తిరిగి నియమించాలని రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఎంఈవో రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ ఆయాపార్టీల నాయకులు పాల్గొన్నారు.

పెద్దపల్లి జంక్షన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి



జీఎంకు వినతిపత్రం అందిస్తున్న దేవీసింగ్ ఠాకూర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి రైల్వే జంక్షన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపేలా చర్యలు తీసుకోవాలని ఉత్తర తెలంగాణ రైల్వేఫోరం ఎగ్జిక్యూటివ్ మెంబర్ దేవీసింగ్ ఠాకూర్ కోరారు. పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో అమృత్‌భారత్ పథకం కింద సాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించేందుకు వచ్చిన రైల్వే జీఎం సందీప్ మాథూర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. బెంగుళూరు, తిరువనంతపురం స్వర్ణ జయంతి వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును శబరిమలై, తిరుమల భక్తుల కోసం ఆపేలా చూడాలని కోరారు.

మాజీ మంత్రి పరామర్శ



మాజీ జెడ్పీటీసీని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్

ధర్మారం: ధర్మారం మండలంలో వివిధ గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం పరామర్శించారు. కార్యక్రమాల్లో నందిమేడారం సింగిల్‌విండో చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి, మాజీ రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు పుస్కూరి రామారావు, నాయకులు దాసరి స్వామి, మహేందర్‌రెడ్డి, ఆవుల శ్రీనివాస్, రాసూరి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొనండి



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

యైటింక్లయిన్‌కాలనీ: దేశవ్యాప్తంగా ఈనెల 9న చేపట్టిన అఖిల భారత సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని హెచ్ఎంఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. సోమవారం ఆర్జీ–2ఏరియా యైటింక్లయిన్‌కాలనీ హెచ్ఎంఎస్ కార్యాలయంలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఎండీ ఇస్మాయిల్, కొమ్ము మధునయ్య, రాజాబాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పలుమండలాలు, గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు అందించిన దరఖాస్తులను పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ శ్రీహర్ష అడిషనల్ కలెక్టర్ వేణుతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేసేవారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పరిహారం ఇప్పించాలి

నాకు చెందిన నాలుగు గుంటల భూమిని సింగరేణి తీసుకుంది. అందులో రెండు గుంటలకే పరిహారం ఇచ్చింది. మిగతా భూమి పరిహారం ఇప్పించండి.
– కొండ రాజమ్మ, యైటింక్లయిన్‌కాలనీ

సర్వే చేయించాలి

మా ఊరులో నాకున్న 11గుంటల్లో మూడు గుంటలు గల్లంతైంది. భూభారతి ద్వారా సర్వే చేయించి మొత్తం భూమికి కొత్త పాసుపుస్తకం ఇప్పించాలి.
– మచ్చ రాములు, కొదురుపాక

వెళ్లిపోమ్మంటున్నరు



తమిళనాడు నుంచి వలస వచ్చినం. 20 ఏళ్లుగా పెద్దకల్వలలో ఉంటున్నం. అప్పడాల వ్యాపారంతో బతుకుతున్నం. ఇంటి అద్దె యజమానులు మమ్మల్ని ఊళ్లో నుంచి వెళ్లిపోమంటున్నరు.
– చిత్రస్ జయజ్యోతి, పెద్దకల్వల

సర్టిఫికెట్లు ఇప్పించండి



సుల్తానాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాకొడుకు అభిరాం చదివి టెన్త్ పాసయ్యాడు. ఫీజు బకాయిలు లేవు. అయినా బకాయిలు ఉన్నాయని ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. నా కొడుకు భవిష్యత్‌కు ఇబ్బంది కలుగకుండా సర్టిఫికెట్లు ఇప్పించండి.
– అప్పాల చంద్రశేఖర్, పెద్దపల్లి

బల్దియాలో అక్రమ కట్టడాల కూల్చివేత

- అడ్డుకొని నిరసన తెలిపిన బాధితులు
- టౌన్‌ప్లానింగ్, సింగరేణి, పోలీసులతో వాగ్వాదం



గోదావరిఖని చౌరస్తా సమీపంలో ఓ భవనాన్ని కూల్చివేస్తున్న టౌన్‌ప్లానింగ్ విభాగం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో సోమవారం పలు అక్రమ కట్టడాలను పోలీసు బందోబస్తు నడుమ బల్దియా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు కూల్చివేశారు. గోదావరిఖని చౌరస్తాలో రెడిమేడ్ షోరూం నిర్వహిస్తున్న ఓ భవనాన్ని, కొంత భాగం కూల్చి వేయడానికి జేసీబీ వాహనంతో టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు చేరుకోగా, భవన యజమానితో పాటు పోచమ్మగుడి ప్రాంతంలోని మిగిలిన భవన యజమానులు సంయుక్తంగా ఏకమై అడ్డుకున్నారు. అధికారులతో వాగ్వాదంకు దిగారు. సింగరేణికి చెందిన సర్వేనంబర్ స్థలాన్ని ఆక్రమించుకొని భవనం నిర్మించారని, సింగరేణి సంస్థ అధికారులు ఫిర్యాదు చేస్తేనే కూల్చివేయడానికి వచ్చామని టౌన్‌ప్లానింగ్ టీపీఎస్ నవీన్ స్పష్టం చేశారు. కూల్చివేతలను మొదలెట్టడంతో భవన యజమానితో పాటు తోటి భవన యజమానులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. రాత్రి వరకు కూడా భవనం కూల్చివేతలు కొనసాగుతున్నాయి. అలాగే ఓ ఫంక్షన్‌హాల్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు ప్రహరీని కూడా కూల్చివేసినట్లు టీపీఎస్ నవీన్ వెల్లడించారు.

విద్యార్థులతో పనులు చేయించిన ఉపాధ్యాయులు



పాఠశాలకు సామగ్రి చేరవేస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ బాలుర హైస్కూల్ విద్యార్థులు విద్యాభ్యాసం కోసం రాగా.. వారిని సామాగ్రి చేరవేసే పనిలో ఉపాధ్యాయులు వినియోగించుకోవడంతో పలువురు ఆశ్చర్యానికి గురయ్యారు. స్థానిక క్లబ్‌లో భద్రపరిచిన పాఠ్య పుస్తకాలతోపాటు టెలివిజన్ సామగ్రి, ఇతర వస్తువులను విద్యార్థులతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మోయించారు. డబ్బులు ఖర్చు కావొద్దనే విద్యార్థులతో పనులు చేయించారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పర్యావరణం పరిరక్షణకు రీసైక్లింగ్ పటిష్టంగా చేపట్టాలి



మాట్లాడుతున్న వెంకటస్వామి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమీనగర్‌లోని డ్రై రీసోర్ట్ సెంటర్, కంపోస్ట్ యార్డును సోమవారం రామగుండం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి సందర్శించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా డిప్యూటీ కమిషనర్ నాయన వెంకటస్వామి మాట్లాడుతూ... పర్యావరణంపై దుష్ప్రభావం పడకుండా చెత్త రీసైకిలింగ్ పటిష్టంగా చేపట్టాలన్నారు. చెత్తను ఇంటి వద్దనే తడి చెత్త పొడి చెత్తగా వేరుచేసి ఇస్తే రీసైకిలింగ్ ప్రక్రియ మరింత సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ఏఈ తేజస్విని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగు నాగభూషణం, కిరణ్, కుమారస్వామి, హెల్త్ అసిస్టెంట్ సంపత్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, శ్రీకాంత్, శ్వేత, వార్డు అధికారులు పాల్గొన్నారు.

కవితకు బంగారు పతకం



కాల్వశ్రీరాంపూర్: తారుపల్లి గ్రామానికి చెందిన రాజగోళ్ల లక్ష్మి ఏకైక కుమార్తె రామగుండం కవిత కాకతీయ యూనివర్సిటీలో సైకాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ప్రథమ స్థానం పొందగా.. కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవ వేడుకలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా బంగారు పతకం స్వీకరించింది.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్



మాట్లాడుతున్న రాంచందర్

పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ పథకాన్ని అమలు చేస్తోందని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. సోమవారం పెద్దపల్లి శివారు రంగంపల్లిలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ పథకం కింద రూ.లక్ష నుంచి మొదలు రూ.5 కోట్ల దాకా ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలు అందించేలా ప్రధాని నరేంద్రమోడీ సర్కార్ నిర్ణయం తీసుకుందని వివరించారు. ఆసక్తి, అర్హత గల వారంతా పథకాన్ని సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. తమకు అవగాహన ఉన్న లాభసాటి పరిశ్రమలు ఏర్పాటుచేసి మరో పదిమందికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏజీఎం మూర్తి, డిప్యూటీ డైరెక్టర్ దశరథ్, పరిశ్రమలశాఖ ఏడీ కీర్తికాంత్, మస్తాన్‌ఖాన్ పాల్గొన్నారు.

శిథిల భవనం తొలగింపు



పనులు పర్యవేక్షిస్తున్న ఎంఈవో విమల

ఫెర్టిలైజర్ సిటీ: పాలకుర్తి మండలం ఎఫ్‌సీఐ ఎలకలపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో భవనం శిథిలావస్థకు చేరడంతో.. పాఠశాల హెచ్ఎం, పాలకుర్తి ఎంఈవో విమల జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. సోమవారం పాఠశాల ఆవరణలో శిథిలమైన భవన తొలగింపు పనులను ప్రారంభించారు. సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించాలని వినతి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమీనగర్ రైల్వే గేట్ సమస్య పరిష్కరించాలని రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బూర్ల శ్రీనివాస్ సోమవారం సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం సందీప్ మాథుర్‌కు వినతి పత్రం అందించారు. రైల్వే గేట్ వద్ద ప్రజలు పడుతున్న ఇబ్బందులపై రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఫ్లైఓవర్, అండర్ గ్రౌండ్ బ్రిడ్జ్, సిగ్నల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, పల్లె హరీష్‌రెడ్డి, ఆసిఫ్ ఖాన్, మల్లేష్, ప్రణీత్ ఉన్నారు.

● కంది విత్తనాలు పంపిణీ

జూలపల్లి: పలు గ్రామాలకు చెందిన రైతులకు సోమవారం కంది విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ కొంజెర్ల వెంకటయ్య, ఏవో ప్రత్యూష, ఏఈవో కిరణ్మయి, సీఈవో సురేశ్ ఉన్నారు.

● ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ప్రగతినగర్ ప్రాంతంలో విశ్వహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి సత్యం తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు వీలుగా ఈ శిక్షణ ఇప్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు సెల్ నంబర్ 8919152915లో సంప్రదించాలని కోరారు.

● డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

గోదావరిఖని: మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడిన ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు తెలిపారు. డ్రంక్అండ్‌డ్రైవ్‌లో దొరికిన 10 మందిని సోమవారం సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ముందు హాజరుపర్చగా రూ.16వేలు జరిమానా విధించారని, వీరిలో ఇద్దరు రెండోసారి మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడటంతో మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు వివరించారు.

● సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మంథనిరూరల్; వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో శశికళ సూచించారు. సోమవారం మంథని మండలం సిరిపురంలో పారిశుధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతిఒక్కరూ దృష్టిసారించాలన్నారు. వన మహోత్సవంలో బాగంగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి బి.నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

● సార్వత్రిక సమ్మెకు మద్దతు

జ్యోతినగర్: దేశవ్యాప్తంగా ఈనెల 9న జరుగనున్న సార్వత్రిక సమ్మెకు సీపీఐ(యంఎల్)మాస్‌లైన్ ప్రజాపంథా మద్దతు తెలియజేస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణరెడ్డి ప్రకటించారు. సోమవారం కరీంనగర్ ఉమ్మడి జిల్లా ముఖ్యుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమ్మెలో మాస్ లైన్ శ్రేణులంతా పాల్గొని సమ్మె జయప్రదానికై కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు తోకల రమేశ్, ఈసంపల్లి రాజేందర్, మార్త రాములు, పుల్లూరి నాగభూషణం, కలవల రాయమల్లు, పెండ్యాల ఓదెలుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

● డైరెక్టర్ (పా)ను కలిసిన ఆర్జీ–2 అధికారులు

గోదావరిఖని: స్థానిక ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో ఆర్జీ–2 ఏరియా అధికారులతో సింగరేణి డైరెక్టర్(పా)గౌతం పొట్రు సమావేశమయ్యారు.ఏరియాకు సంబంధించిన ఉత్పత్తి, ఉత్పాదకత, ఉద్యోగుల వివరాలు, సంక్షేమం తదితర విషయాలపైన కూలంకషంగా చర్చించారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా వచ్చిన డైరెక్టర్(పా)ను ఆర్జీ–2 జీఎం వెంకటయ్య శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేశారు.

● డైరెక్టర్(పా)ను కలిసిన బీసీ ఎంప్లాయీస్ ఉద్యోగులు

స్థానిక ఇల్లెందు క్లబ్‌కు వచ్చిన డైరెక్టర్(పా) గౌతం పొట్రును సోమవారం బీసీ ఎంప్లాయీస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేశారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో నాయకులు చిలుక శ్రీనివాస్, వసంతకుమార్, పెంచాల తిరుపతి, దేవాచారి, మోహన్, మల్లేశ్ తదితరులున్నారు.

● అనుమతిలేని పాఠశాలపై చర్య తీసుకోవాలి

సుల్తానాబాద్: పట్టణంలో అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎంఈవో రాజయ్యకు సోమవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం వినతిపత్రం అందజేశారు. ధనార్జనే ధ్యేయంగా ఇష్టానుసారంగా నడుపుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఎల్కపల్లి సురేష్, మండల కార్యదర్శి పల్లె శ్రీహర్ష, ఈదునూరి ప్రీతం తదితరులు పాల్గొన్నారు.

● సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సుల్తానాబాద్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేశ్ అన్నారు. సోమవారం సుల్తానాబాద్‌లో తడి పొడి చెత్తపై అవగాహన కల్పించారు. పారిశుధ్య పనులు ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలని అన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



కూల్చివేసిన అక్రమ కట్టడం

జ్యోతినగర్: రామగుండం నగర పాలక సంస్థ 5వ డివిజన్ పరిధిలోని మల్కాపూర్‌లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను సోమవారం అధికారులు కూల్చివేశారు. మార్చి 6వ తేదీన 'ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు' పేరిట సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ ఎట్టకేలకు స్పందించి విచారణకు ఆదేశించారు. ఈక్రమంలో ఆ ప్రభుత్వ భూమిలో వెలిసిన నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేవని నిర్ధారించి సోమవారం జేసీబీతో నిర్మాణాలను కూల్చివేశారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్నచిలువేరి స్వామి

రామగిరి: ఈ నెల 9న దేశ వ్యాప్త సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిలువేరి స్వామి అన్నారు. సోమవారం కల్వచర్లలో రామగిరి మండల భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎసకే షరీఫ్, కుసుమ సురేష్, వెంగలి రాములు, జంగిలి తిరుపతి, సంతోష్, రమేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గేట్ మీటింగ్

సమ్మెను సింగరేణి కార్మికులు విజయవంతం చేయాలని జేఏసీ కన్వీనర్ కోట రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆర్జీ–3 ఏరియాలోని ఓసీపీ–1,2 గనులలో, ఏపీఏ గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కేంద్ర విధానాలతో సింగరేణి మనుగడకు విఘాతం కలుగుతుందని, కార్మిక రంగానికి నష్టం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా నిర్వహించే సమ్మెలో సింగరేణి ఉద్యోగులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు క్రాంతి కిరణ్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బూడిద దందాపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

గోదావరిఖని: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో జరుగుతున్న బూడిద దందాపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు గుమ్మడి కుమారస్వామి హెచ్చరించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బూడిద చీకటి వ్యాపారం బట్టబయలు చేయాలన్నారు. ఈదందాపై చర్యలు తీసుకోకుంటే కార్యాచరణకు దిగుతామన్నారు. ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో కార్మిక శాఖ మంత్రి వివేక్ ముందుకెళ్తున్నారన్నారు. ఆత్మీయ సన్మానానికి తరలివచ్చిన అన్ని సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు భయపడి ఫ్లెక్సీలను తొలగించారని, ఇది సరికాదన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మీపతిగౌడ్, దీపక్, రాజకిషోర్, దుబాసి మల్లేష్, కోటేశ్వర్, బర్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా నిర్మాణం చేయొద్దు



నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

మంథనిరూరల్: అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేయొద్దని డివిజనల్ పంచాయతీ అధికారి కొమ్మెర సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం మంథని మండలం సిరిపురంలోవైకుంఠధామం, చెత్త సేకరణ, నర్సరీలను పరిశీలించారు. ఇంటింటా చెత్త సేకరణ చేపట్టి సెగ్రిగేషన్ షెడ్‌లో తడి, పొడి చెత్తను వేరుచేసి నాణ్యమైన సేంద్రీయ ఎరువు తయారు చేయాలని సూచించారు. గ్రామంలో నిరంతర పారిశుధ్య నిర్వహణ పనులు చేయించాలని పంచాయతీ సెక్రటరీని ఆదేశించారు. ప్రతి రోజు అన్ని వీధుల్లో ఫాగింగ్ చేయించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్(పా) పర్యటన



అధికారులతో సమావేశమైన డైరెక్టర్(పా)

గోదావరిఖని: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సింగరేణి డైరెక్టర్(పా) గౌతం పొట్రూ సోమవారం రామగుండం రీజియన్‌లో పర్యటించారు. ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో ఆర్జీ–1 ఏరియా అధికారులతో సమావేశమై సంస్థ స్థితిగతులు, పనిచేస్తున్న కార్మికులు, సంక్షేమం తదితర విషయాలను అధికారుల ద్వారా తెలుసుకున్నారు. డైరెక్టర్(పా)ను కలిసిన వారిలో ఆర్జీవన్ జీఎం లలిత్‌కుమార్, ఎస్‌ఓటూ జీఎం అంజనేయప్రసాద్, పర్సనల్‌మేనేజర్ రవీందర్‌రెడ్డి, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేయిస్తున్న వెంకటస్వామి

జ్యోతినగర్: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని రామగుండం కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం మూడో డివిజన్ మేడిపల్లి రైతువేదిక వద్ద నిర్వహించిన వన మహోత్సవంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. అన్నపూర్ణకాలనీలో గోడలపై చిత్రీకరిస్తున్న సందేశాత్మక చిత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఏఈ తేజస్విని, శానిటరీ ఇన్స్పెక్టర్లు కిరణ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, మెప్మా సీవో శ్వేత, ఆర్పీలు, వార్డు అధికారులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

జూలపల్లి: రాబోయే స్థానిక ఎన్నికల్లో సమన్వయంతో పని చేసి సత్తా చాటాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ అన్నారు. పెద్దాపూర్‌లో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి, బీఆర్ఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. సమావేశంలో నాయకులు విసారపు వెంకటేశం, కంది చొక్కారెడ్డి, పూరెల్ల గంగయ్య, మాజీ సర్పంచ్ సత్యసాగర్, తొగరు శ్రీనివాస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లక్ష్మినర్సయ్య, స్కైలాబ్, ఆరుకొల్ల శంకర్, గుండు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐల బదిలీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. భానుకుమార్‌ను రామగుండం ఎన్నికల విభాగం సూపరింటెండ్‌గా, వెంకటరాజును సివిల్‌సప్లయిస్ ఇన్‌స్పెక్టర్‌గా చేశారు.